కాకమ్మ 'కట్టెగూడు', పిచుకమ్మ 'పుడకల గూడు' కథ నుంచీ మన పాతకాలం కథలన్నింటిలో కాకిగూడు కూలిపోతూనే వుంది. ఈ సంగతి గమనించిన, గుర్తించిన, దానిని ప్రేమించిన ఒక సాదా ఇల్లాలు కాకమ్మ గూడు కాపాడి తీరాలని శపథం చేసింది. సొంత సౌకర్యాలు కొంత మానుకుని, మానవజాతి నిలబెట్టవలసిన ఆవాసాలు అనేకం అని హెచ్చరిస్తూ...

ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి

11

# కాకి గూడు





ఒడిదుడుకులు తట్టుకోవాలంటే ఏదో ఒక గూడు ఉండాల్సిందే. అది కాకికైనా, మనిషికైనా. నేనొక మనిషిని. ఆడమనిషిని. నా పేరు అడక్కండి. అది ఒక్కోళ్ల దగ్గరా ఒక్కోరకంగా మారిపోతుంది. అయినా నా పేరు తెలుసుకుని మీరు ఏం చేస్తారు? చెప్పాలంటే పేరుతో నాకే ఎప్పుడోగానీ పెద్దగా పని పడదు. ఇది నా పేరు కథ కాదు. మా గూడు కథ.

చిన్నప్పుడు ఒక ఇంట్లో వుండేదాన్ని. అది అమ్మావాళ్ల ఇల్లు. ఇప్పుడు ఉండేది అత్తవారి ఇల్లు. అమ్మ వాళ్ల ఇంట్లో చిన్న పాపాయి గా వున్నప్పుడు ప్రతిరోజూ వెనక ఉన్న మేడవైపు చూస్తే, ఏడుగంటల కల్లా బోలెడన్ని కాకులు వచ్చి వాలి ఉండేవి. ఆ ఇంట్లో ఉండే పెద్దాయన వాటికి మేత వేసేవారు ప్రతిరోజూ. అలవాటు పడటం వల్లన ఏమో, ఆయనకీ ఆరోగ్యం బాలేక ఇంట్లో పడుకుని ఉన్నా కూడా, కొన్ని కాకులు ఆ సమయానికి వొచ్చి ఓసారి తొంగిచూసి వెళ్లేవి. ఏ మాత్రం ఓపిక చిక్కినా, మేతకోసం వొచ్చిన కాకుల్ని నిరాశపరచ కుండా ఆయన బైటికి వొచ్చి వాటికి ఆహారం పెట్టేవారు. అమ్మావాళ్లు ఆయన గురించి చాలా గౌరవంగా మాట్టాడేవాళ్లు. బహుశా ఆయన కాకుల్ని చేరదీయడం మంచి సంగతిగా వాళ్లకి తోచి ఉండవచ్చు. లేకపోతే ఆ ఇల్లు పెద్దది కావడం వల్ల కలిగిన కుటుంబమని గౌర వించేవాళ్లేమో. బహుశా ఈ రెండు కారణాలూ కలిసిపోయి కూడా ఉండుంటాయి.

కాకి ఆయుష్షు డబ్బై ఏళ్లు. మనిషితో కూడా బతుకుతుంది. కానీ మనిషికి మచ్చిక కాదు. సొంతంగా బతకడానికి ఇష్టపడుతుంది. కాకి గురించి పురాణాల్లో కూడా రాశారంట. అమ్మ చెప్పింది. రామా యణంలో రాముడు కాకి కన్ను పొగొట్టాడనీ అందుకే అది ఒకే కంటి తో చూస్తుందనీ, కాకులన్నీ రామాయణ కాలం నాటి కాకాసుర అంశ లనీ కూడా చెప్పింది. రాక్షసుడి అంశ కాబట్టి ప్రతి కాకిలో తప్పనిసరిగా

ఒక దయ్యం లేదా రాక్షసుడు ఉంటాడని నమ్మకం ఉండేది అప్పట్లో. ఆ అతీత భూతాన్ని బైటికి తేవడానికి ఓం హ్రీం అని రకరకాల మంత్రాలు చదివి ప్రయత్నించా. ఏం లాభం లేదు. నా మంత్రాలకి అవి ఎగిరిపోయేవి. అంతే తప్పించి ఏ మాయా బైట పడలేదు. అయినా కూడా కాకంటే భలే సరదా. అది చాలా పద్ధతైన ప్రాణి! దానికి బోలెడు తెలివి. ప్చ్. కానీ ఇప్పుడు కాకులు పెద్దగా కనపడ్డం లేదు. గిన్నెలు కడిగి మెతుకులు బైట పారేస్తే వాటికోసం కాకులు కాసుకుని వాలడంలేదు. ఇప్పుడంతా పందుల కుక్కల యుగం. ఇది జీవపరిణామంలో ఒక దశ అనుకోవాలో లేక మానవులు ఏర్పరచిన దుర్దశ అనుకోవాలో.

ఇప్పుడు ఉండేది అత్తవారిల్లు. అత్తగారిది ఏదో మతం. వాళ్ల మతంలో మనిషి చచ్చిపోయిన రోజే మాంసంకూర వండుకుని తింటారు. మా మతంలో అలా ఉండదు. ఇక్కడ మతం అంటే, ఒకే కులంలో వుండే వేరే వేరే మతాలు! చావు తంతు జరిపిచ్చే పద్ధతిని బట్టి శూద్రకులాల్లో వివిధ మతాలు వుంటాయి. మామూలు గానైతే ఏ మతం వాళ్లు ఆ మతం వాళ్లనే పెళ్లి చేసుకుంటారు. కానీ, మా సంబంధం చూసేటప్పుడు ఆ విషయం మరిచిపోయారంట. పెళ్లయిన కొత్తలో మా అత్త, 'మీరు మోడోళ్లు కదా. కాకికి పిండం పెట్టే మతం వాళ్లు,' అంది. నాకు అదేదో తిట్టులా అనిపించింది. భలే కోపం వచ్చింది. కొంచం తమాయించుకుని ఏదో జవాబు చెప్పాను. కొత్త కోడలికి అన్నీ ఎత్తు పోడుపులే. ఒంటరి పోరాట యోధురాలు. యుద్ధాలు చాన్నాళ్లు జరుగుతాయి. వయసుని బట్టి క్రమంగా అత్త ఓడిపోయి లొంగి పోతుంది. కోడలు గెలుస్తుంది.

మా అత్త స్వతహాగా చాలా మెత్తని మనిషి. తెలివైనది కూడా. చిన్న వయసులోనే పెళ్లి చేసుకొని సంసారపరమైన శిక్షణలో ఆరితేరిన ఇల్లాలి నైపుణ్యం ఆమెలో పుష్కలంగా ఉంది. మేమిద్దరం పెద్దగా తగాదాలు పడకుండా ఒద్దికగా ఉన్నామంటే, మొత్తం మెచ్చుకోలు ఆమెకే ఇవ్వాలి. ఆవిడ ప్రాణాలన్నీ కొడుకుమీదే. మొదట్లో చెట్టంత మొగోడిని పసిబిడ్డలాగా చూస్తూ ఆమె చేసే గారాబానికి నాకు చిరాకు వొచ్చేది. వాళ్ల కబుర్లూ, కాలక్షేపాలూ భలే చోద్యంగా ఉండేవి. అత్త ప్రతివారం కొడుక్కి స్వయంగా తల రుద్ది స్నానం చేయించేది. తరవాత (ఇది మరీ విడ్డూరం) ఒళ్లంతా పౌడరుతో నిమిరేది. నిద్రపోయేప్పుడు కాళ్లకి కర్పూరనూనె రాసేది. చూసి చూసి మెల్లగా చెప్పేశా, వయసులో చిన్నవాడు కదా, కాళ్లు పడితే ఆయనకి మంచిది కాదని. మొదట్లో బాధపడింది. క్రమంగా అలవాటుపడింది. పోను పోను మిగతా సేవలు

కూడా ఆగిపోయాయి. అందుగురించి మా ఆయన లోపల్లోపల ఏవన్నా అనుకున్నాడేమో, నాకైతే తెలీదు.

ఈ కొత్త ఇల్లు, అదే, మా అత్త ఇల్లు 'నాది' అనే భావన చాన్నాళ్లు కలగలేదు నాకు. ఎవరింటికో వొచ్చి అది నాది అని భ్రమ కల్పించుకోవాల్సినట్లుగా, బాడుగ కట్టని అద్దెవాళ్లు ఇంటిగల వాళ్లకు భయపడినట్టు బెరుకు బెరుకుగా ఉండేది. ఈ గూడు నాదే. దీనిలో నేనొక భాగం అని కాస్త అనిపించింది నా బిడ్డలకి తల్లిని అయిన తరవాతనే. ఓ సాధారణ ఆడమనిషికి ఎక్కడోగానీ స్వతహాగా గుర్తింపు ఉండదు. అత్తవారింట్లో గుర్తింపు బిడ్డల నుంచి, బైట గుర్తింపు భర్త నుండి వస్తుంది. ఇది నిజం.

ఇంతకీ కాకి భాగోతం చెప్పాలి. మాది రెండు పోర్షన్ల ఇల్లు. పైన అత్తా, మామా. కింద నేనూ మా సంసారం. మా కాపురాల్లో ఖర్చూ ఆదాయం ఎవరిదీ వాళ్లకే. అయితే కూరలూ, భోజనాల దగ్గర కొన్ని ఉమ్మడిలో నడుస్తున్నాయి. ఇంటిబైట చెట్లూ చేమలూ, బోలెడు స్థలం పెద్ద గేటుతో పల్లెటూరిలో ఇల్లుకు మల్లే చేసినంత చాకిరీగా ఉంటుంది.

ఇంటి గుమ్మం ఎదురుగా ఓ వేపచెట్టు ఉంది. ఈమధ్యే, ఓ మూడేళ్ల కిందట దానికదే మొలిచింది. మనం నీళ్లు పోసి పెంచితే చప్పున పెరగవు. వాటికవే మొలిస్తే మహాజోరుగా పెరిగిపోతాయి. ఈ వేపచెట్టు ఇప్పటికి ఇరవై అడుగుల పైగానే పెరిగింది. చిటారు కొమ్మన కొత్తగా కాకి గూడు కడుతోంది. ముందు నేను గమనించలేదు. రోజూ కొబ్బరి చీపురుకట్ట చిందరవందర అయిపోతుంటే పిల్లలు గాలిపటాలు చేస్తున్నారు గావున అనుకున్నాను. కానీ ఓ సాయంకాలం చీపురు చుట్టి కడుతుంటే మావయ్య అసలు సంగతి చెప్పారు.

"కాకి గూడు పెడుతోంది. పొడుగు వెదురు కర్ర తెచ్చి కిందికి తోసెయ్యాలి."

పైకి చూశాను. చాలా జాగ్రత్తగా పుల్లలనీ, పుడకల్నీ, గుడ్డ పేలికల్నీ పోగేసి గూడు తయారుచేస్తోంది.

"ఉండనివ్వండి మావయ్యగారూ. అది మనల్నేం చేసింది?"

"అదేమిటమ్మాయి? ఇంక వస్తూ పోతూ వుంటే పిల్లల నెత్తి మీద కొడుతుంది."

"అది చాలా ఎత్తులో ఉంది. కొట్టదులెండి."

"అర్థంపర్థం లేకుండా మాట్లాడుతావేంటమ్మా? ఆ పక్క పాలెంలో పిల్లల్ని పిల్చి ఓ పదిరూపాయలు ఇచ్చి అది తీయించేయ్," గట్టిగా గదమాయిస్తూ ఆర్డరు వేశారు.

"గుడ్లు పెట్టకముందరే గూడు తీయించాలి. లేకపోతే ఇబ్బంది," మళ్లీ మళ్లీ సణుగుడు వినబడింది.

చాలా కోపం వచ్చింది. బాధ కలిగింది. కానీ ఇంకేం బదులు మాట్లాడకుండా పనిలో పడిపోయాను. ఆ ఆలోచన వదిలిపెట్టలేదు. చిన్నతనంలో ఎన్ని వీధి కుక్కల్ని సాకాను?! ఎక్కడ ఏ పిట్ట అపాయంలో వున్నా తప్పనిసరిగా సహాయం చేసేదాన్ని. బ్రతికే అవకాశం లేనివి నా చేతుల్లో నా కన్నీళ్లు చూస్తూ చనిపోయేవి. వాటికి సమాధులు కట్టి ప్రతిరోజూ వాటి జ్ఞాపకంగా ముగ్గులు వేసేదాన్ని. ఈ పనిలో ఇంట్లో పిల్లలు, పక్కింటి పిల్లలు కూడా పాలుపంచుకోనేవాళ్లు. అమ్మా, నాన్న దీనిలో జోక్యం చేసుకోకపోయినా మాకు అడ్డం వచ్చేవాళ్లు కాదు. ఇప్పుడు ఉంటున్న ఇంటి నేపథ్యం పూర్తిగా వేరేగా వుంటుంది. మేడపైని పిచ్చుక గూడు తీసి పారెయ్యడం. పిల్లాడు సరదాకి కుండీలో చింత మొక్క నాటితే, చింత చెట్టు అరిష్టం అని వాడు బడికెళ్లి వొచ్చేప్పటికి పీకేయ్యడం. గుమ్మానికి ఎదురులేకపోయినా, అరటి చెట్టుని నిర్దాక్షిణ్యంగా తీసెయ్యడం. వీటిని కాపాడేదానికి నా బలం సరిపోలేదు. ఇప్పుడు మాత్రం గట్టి పట్టుదల వొచ్చింది. అత్తా మామా ఆరోగ్యం బాగోడం లేదు. సొంతంగా చాలా పనులు చేసే పరిస్థితి రోజురోజుకీ తగ్గొచ్చింది. చిన్న చిన్న విషయాలకి నా మీద ఆధార పడతారు. మరి నా మాట మన్నించి ఓ చిన్న పక్షి గూడుని వుండనియ్యకూడదా.

"వేపచెట్టు మీద కాకి గూడు పెట్టింది," నిద్రలోకి జారుతున్న మా ఆయన్ని తట్టి లేపి మెల్లిగా చెప్పాను.

"సరే పెడితే పెట్టనీ," ఇప్పుడు ఆ సంగతి నిద్ర లేపి చెప్పాలా అన్నట్లు చూశాడు.

"మీ నాన్న తీసెయమంటున్నారు. నాకు తీయడం ఇష్టం లేదు."

"ఎందుకు తియ్యమంటున్నాడు?"

"పెద్ద కారణం ఏంలేదు. పిల్లల్ని కొడుతుందని భయం. కానీ నాకు తియ్యడం ఇష్టం లేదు. పిల్లలు గూడు చూసి సరదా పడుతున్నారు."

"సరే, అయితే ఉండనీ."

ఇంక వినడానికి ఏమీ లేనట్టు నిద్రపోయాడు. అయితే మా ఆయన ఒప్పుకోలు అంత నమ్మదగినది కాదు. బలమైనదీ కాదు. పైకి ఏదేదో చెప్పినా లోపల వాళ్ల నాన్నంటే ఇప్పటికీ భయమే. చిన్న విషయంలో కూడా నాన్న మాటకి ఎదురు చెప్పడు. ఎలాగోలా సామరస్యంగా పనులు జరిపించాలని చూస్తాడు. రేపు ఈ కాకి సంగతి

కూడా, ఆయన ఒక అరుపు అరిస్తే ఈయన మాట మార్చేస్తాడు. కానీ ప్రస్తుతం తను ఒప్పుకోవడం నాకు అవసరం.

తొలిచూలు అబ్బాయిని కని తొమ్మిది నెలలు పుట్టింటిలో ఉండిపోవడం గుర్తుకు వొచ్చింది. బిడ్డను చూడ్డానికి రెండు మూడుసార్లు వొచ్చాడు. వొచ్చిన ప్రతిసారీ, ఇంకా కొన్నాళ్లు ఇక్కడే ఉండు అనేవాడు.

"నేను బానే వున్నాను. వచ్చేస్తాను. కొన్నాళ్లు సాయానికి ఓ పిల్లని పెట్టుకుంటే సరిపోతుంది," అన్నాను.

"మంచి ఇల్లొకటి అమ్మకానికి వచ్చింది. నాన్నని కొద్దిగా డబ్బు సర్దుబాటు చెయ్యమంటే కుదరదన్నాడు. ఏదో సాకు. వాస్తు మంచిది కాదు, కలిసి రాదు అంటాడు. డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఇవ్వన్నీ. ఇంక మనం ఆ ఇంటిని వదిలేసి బాడుగిల్లు వెతుక్కుని బైటికి వెళ్లిపోదాం."

ఇల్లు సంగతి వాళ్ల నాన్నతో ఎదురుపడి మాట్లాడింది తక్కువ. అమ్మతో ఆయనకి చెప్పించాడు.

మావగారు, "నేనేం ఇవ్వలేను," అనేశారని కోపం.

ఆడపిల్ల తొలిచూలు తరవాత పుట్టింటిలోనే కుదిరినన్ని రోజులు ఉండాలని చూస్తుంది. నాకెందుకో మా ఇంటికి వెళ్లిపోవాలని ఉండేది. ఫోన్‌లో మాట్టాడతాడు. కానీ, ఇంటికి రమ్మని చెప్పడు. ఎన్నాళ్లకీ పిలవకపోయేసరికి నేనే ఓ మనిషిని తోడు చేసుకొని బయలుదేరా.

నన్ను చూసి మా అత్త విస్తుపోయింది. గుమ్మంలోనే ఆపి ఎర్రనీళ్లు తీసి చంటాడినీ నన్నూ లోపలికి తీసుకెళ్లింది. కాసేపటికి మా ఆయన వొచ్చాడు. రోజూ ఇంట్లో చూస్తున్న మనిషినే చూసినట్టు మామూలుగా ఉన్నాడు.

"మనవడి మొహం చూసి మీ మామ నిన్ను ఇంట్లోకి రానిచ్చాడు. మొదలైతే చాలా కోపం మీద ఉన్నాడు," హఠాత్తుగా ఓ రోజు మా అత్త అన్నది.

'నేనేం చేశాను?" నాకు అర్థం కాలేదు.

"డబ్బు సాయం చెయ్యలేదని నీ మొగుణ్ణి మాతో మాట్టాడొద్దని కట్టడి చేశావుగా. తల్లీ తండ్రీ ఆశతో కొడుకుల్ని కంటారు. ఎంతో కష్టపడి పెంచితే వాళ్లు ఎక్కొస్తారు. వాస్తు వీలు చూడకుండా ఏదిబడితే అది వాడు కొంటాను అంటే మీ మామ ఎందుకు ఒప్పుకుంటాడు?"

అసలు సంగతి వేరే. ఇల్లు కొంటే కొడుకు తమని వదిలి వెళ్లిపోతాడని భయం. తమాషా ఏంటంటే, కొనాలని చూసిన కొడుకు మంచోడే. మొత్తం కథలో ఏ ప్రమేయమూ లేకపోయినా కోడలు చెడ్డది! కళ్లేమ్మట నీళ్లొచ్చాయి. ఆవిడ నమ్మినదో లేదో తెలీదుగానీ, నా సంజాయిషీ నేను చెప్పుకున్నాను. కొన్ని రోజులకి కోపతాపాలు సర్దుకున్నాయి.

కాకి గూడు యవ్వారం తేల్చడానికి మా అత్త రంగంలోకి దిగింది.

"ఎదురింటి బ్రాహ్మల కానగ చెట్టుమీద గూడు పెట్టింది ఈ కాకే. వాళ్ల పిల్లల్ని పైకీ కిందికీ కదలనివ్వలేదు. తలమీద పెరికి పెరికి పెట్టేది. విసుగు పడలేక పాలెం పిల్లోళ్లని పిల్చి గూడుని పిల్లలతో సహా ఎత్తకపొమ్మన్నారు."

"కాకి పిల్లల్ని వాళ్లేం చేసుకుంటారు," అడిగాను.

లోపల్లోపల భయం వేసింది.

"వాళ్లేదో వైద్యకానికి వాడతారు," చల్లగా చెప్పింది.

గుండె కలుక్కుమంది. చిన్న కాకి పిల్లలు. అమ్మ తెచ్చే మేత కోసం కాచుకుని ఉండుంటాయి. తిరిగి తిరిగి వాళ్లమ్మ తప్పకుండా ఏదో ఒక తాయిలం తెస్తుందని చూస్తూ ఉండి ఉంటాయి. అమాయక పక్షులు. వాటిని ఎలా ఎత్తుకుపోతారు. ఎలా చంపేస్తారు. మనిషి ఎందుకని ఇంత కఠినంగా ఉంటాడు. ఏది ఏమైనా, ఆ గూడుని కాపాడి తీరుతాను. గట్టిగా ఊపిరి తీసి వదిలాను.

"అలా గూడుని పడగొట్టి పిల్లల్ని చంపడం పాపం," దృఢంగా చెప్పాను.

"పాపం పుణ్యం అని ఏమీ ఉండవు. అదంతా మన పిచ్చి," మా అత్త వేదాంతానికి పోయింది.

నాకు ఒళ్లు మండింది. వాళ్లకి అనుకూలం అయిన సంగతుల్లో పాపం పుణ్యం ఉంటాయి. అనుకూలం కాకపోతే ఉండవు.

"నేనుగా గూడు పడగొట్టించలేను. మా ఊళ్లో పెద్దోళ్లు అంటారు, అది చాలా అరిష్టం అని. చెప్పినా వినకుండా మా బావ పెద్ద మరిది అలానే పడగొట్టాడు. అతని ఇంటికి నిప్పంటుకుంది. మా బంధువుల్లోనే వేరే వాళ్లకి ఒళ్లంతా చీడ పుట్టి, మనిషి కమిలిపోయి చచ్చినంత పని అయ్యింది. అంతదాకా ఎందుకు, ఆ ఎదురింటి పిల్ల చెయ్యి విరిగింది ఆ పాపం తగిలే. నా పిల్లలికి అలాంటి పాపాలు సోకనివ్వను. నాలుగు రోజులు ఓపిక పడితే పిల్లలు పెద్దవి అయి వాటి దారిన అవే పోతాయి.

ఆ ముదనష్టపు కాకి శాపం మనకెందుకు. పచ్చని కాపురంలోకి లేని పోని తగలాటాలు. ఆ మాట పోనీండి అత్తయ్యా."

నిజానికి ఈ నా ఉపాయానికి తిరుగులేదు. కానీ మా అత్త సానుకూలంగా ఏమీ మాట్లాడలేదు. సాయంత్రం మా ఆడబిడ్డ వొచ్చింది. మా ఆయన కన్నా వయసులో పెద్దది. మా పెళ్లి నాటికే తనకి పది తొమ్మిదేళ్ల పిల్లలు. ఇప్పుడు కూతురు పెళ్లి చెయ్యాలని సంబంధాలు చూస్తోంది. ఏదో ఒక సంబంధం కుదిరేలా ఉందంటున్నారు. దాని గురించి మాట్లాడాలనే వొచ్చింది. మంచి సంబంధం అంది. ఫోటో తెచ్చింది. ఫోన్‌లో కూడా చాలా ఫోటోలు వున్నాయని చూపించింది. పిల్లాడు బానే ఉన్నాడు. కట్నం కానుకలూ కుదిరాయి. అయితే పిల్లకి వడ్డాణం పెట్టమని అత్తగారు అడిగారట. ఇప్పటికిప్పుడు వడ్డాణం అంటే కనీసం పది లక్షల పైనే. పుట్టింటి సాయం కోరి వచ్చింది. కూతురు అడిగితే మా అత్త 'కాదు' అనలేదు. అది కుదిరే పనో కాదో కూడా ఆలోచించకుండా భరోసా ఇచ్చేస్తుంది. ఇచ్చేసింది కూడా. ఇంతలో ఇంటిలో మొగాళ్లు చేతులు ఎత్తేసి ఆమెకి గాబరా పుట్టించారు.

"మనవరాలి పెళ్లి ముచ్చటకి సాయం చేసేదానికి డబ్బులు లేవంట. ఆడ మనిషిని. నావల్లన కాక కదా. నా దగ్గరే డబ్బులు ఉండి ఉంటే బిడ్డని ఉసూరు మంటూ పంపిస్తానా? ఈ ముసలాయన నాకేం నగలూ, గిగలూ దిగేయ్యలేదు. నా బిడ్డ ఇన్నాళ్లకి వొచ్చి అడిగితే కూడా లేదంటాడు," మా అత్త నా దగ్గర వాపోయింది.

నేను కాసేపు ఆలోచించాను. కాసేపే.

"నా వడ్డాణం ఉంది ఇచ్చేయండి అత్తయ్యా. నేనది బీరువాలోంచి తీసేది లేదు, పెట్టుకునేది లేదు. వూరికే పడి ఉంది. నా కూతురు పెళ్లికి ఎక్కొచ్చేప్పటికి మళ్లీ చేయిద్దాంలే."

మా అత్త బిత్తర పోయింది. కానీ వద్దనలేదు. బీరువా తాళం తీసి వడ్డాణం ఆవిడ చేతిలో పెట్టాను. నేను నిజం చెబుతున్నానని ఆవిడ నమ్మేప్పటికి కాసేపు పట్టింది.

ఆ వడ్డాణం మా అమ్మమ్మది. అమ్మమ్మకి చిన్నప్పుడే పెళ్లి అయిపోయిందంట. ఆడతా పాడతా ఉండే పసిదాన్ని చూసి మోజుపడి తాత పెళ్లైతే చేసుకున్నాడుగానీ ఆ పిల్లని తన దారికి తేలేకపోయాడంట. ఏ పొద్దూ వాళ్లకి తగవులతోనే గడిచేదంట. ఓసారైతే తాత మీద కోపం వొచ్చి అమ్మమ్మ తాత చేతిని గట్టిగా కొరికేసిందంట. మీ అమ్మమ్మ కొరికిన గాట్లు ఇవిగో అని అప్పుడప్పుడూ మాకు చూపించేవాడు. ఆ

మాటలు ఎత్తితే అమ్మమ్మకి భలే కోపం. గట్టిగా కేకలు వేసేది. కానీ మళ్లా కాసేపటికి పక్కకి తిరిగి నవ్వుకొనేది. చివరికి అమ్మమ్మకి ఈ వడ్డాణం కొనిచ్చి మంచిగా లొంగ దీశాడంట. అమ్మమ్మ ఆ వడ్డాణం మా అమ్మకి ఇచ్చింది. నాన్న కుటుంబం, అమ్మ కుటుంబమంత డబ్బుగలవాళ్లు కాదు. అయినా పిల్లాడు గుణవంతుడని పిల్లని ఇచ్చారంట. తాత వడ్డాణంతో అమ్మమ్మని మచ్చిక చేస్తే, అమ్మ ఆ వడ్డాణంతో నాన్న కుటుంబం మొత్తాన్నీ గెలిచేసింది. నా పెళ్లిలో ఆ వడ్డాణం నాదైంది. నాకు మాత్రం వడ్డాణం పెట్టుకుంటే, హాయిగా తిరిగే పిల్లని గుంజకు కట్టేసినట్టుగా ఉంటుంది.

"వచ్చే జన్మలో నీ కడుపున పుడతాను. నా మాట నిలబెట్టావు," అని మా అత్త నా చేతులు పట్టుకుంది.

'అయ్యో, భలేవారే. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. మీ మనవరాలు నా బిడ్డలాంటిదే కదా. మీరు మాటిస్తే ఒకటీ నేను మాటిస్తే ఒకటీనా. ఏది ఏమైనా మనింటి ఆడపిల్ల కుటుంబంలో మొదటి పెళ్లి. ఈ సమయంలో అన్నీ మంచి పనులే జరగాలి. నామాట విని మీరు ఆ కాకి గూడు జోలికి వెళ్లే ఆలోచన వొదిలి పెట్టేయండి. లేని పోని శాపాలకి దూరంగా ఉంటే మేలు," అర్థంపర్థం లేకుండా ఆ టైములో కాకి గూడు గురించి ఎత్తినందుకు విసుక్కోలేదు మా అత్త.

"దానిదేముంది తల్లీ. ఈ ఇల్లు నీది. నువ్వు చెప్పినట్లే జరుగుతుంది," అంది.

వడ్డాణం ఇచ్చి ఇంటి రాణి పదవి సంపాయించాను. ఇంక నాకు తిరుగే లేదని పించింది. చెప్పాపెట్టకుండా అంత పెద్ద వస్తువు ధారాదత్తం చేశానని మా ఆయన కొట్టినంత పని చేశాడు. మా అత్త అడ్డం వొచ్చి, మా పిల్ల పెళ్లినాటికల్లా మా మామతో చెప్పి ఎలాగైనా కొత్తది చేయించి ఇస్తానని ఆయన్ని సముదాయించింది.

పైకి మాట్లాడకపోయినా, ఆడపడుచుకి నేను సాయం చెయ్యడం నుంచి మా మామ లోపల్లోపల చాలా సంతోషించాడు. వడ్డాణం మెరుగుపెట్టిన తరవాత చూస్తే కొత్తవాటిని తలదన్నేలా ఉండింది. పెళ్లి ఆడపడుచు ఇంట్లో అయినా, సందళ్లు మా ఇంటిని కూడా ముంచెత్తాయి. ఈ కోలాహలంలో కాకి సంగతి ఎవరూ ఇంక పట్టించుకోలేదు. మా అత్త కూడా మామకి దాని గురించి ఏదో చెప్పినట్లే ఉంది, ఆయన ఇంక ఆ విషయం ఎత్తలేదు.

కాకి రెండు గుడ్లు పెట్టింది. జోడు కాకులు వాటి పిల్లని చూసుకుని మురిపెం గా ఒకటే గోల గోల చేశాయి. పాలెం పిల్లలు రోడ్డుమీంచి పోతూ ఓ పది రూపాయలు గిట్టుబాటు అవుతాయేమో అని ఆశగా ఆ గూడు వంకా, నా వంకా చూశారు. అసలు

పదిరూపాయలు ఇవ్వకపోయినా, ఊరకే ఆకతాయితనానికైనా గూడు పడగొట్టేయ గలరు వాళ్లు. అందుకే వాళ్లని పిల్చి,

"మా ఆయన పోలీసు. మా ఇంట్లో వస్తువుల జోలికిగానీ, చివరికి పిట్టల పిల్లల జోలికిగానీ వొచ్చారా, తాట తీయిస్తా," అని గట్టిగా బెదిరించాను. మావూలుగా నైతే వాళ్లు అట్లాంటి అదిలింపులకి జడవరు. కానీ, మా ఆయన ఒడ్డూ పొడుగూ చూసి అనుకుంటాను, ఇటువైపుకి రావడం మానుకున్నారు.

బుజ్జి కాకి పిల్లలు పెరిగి పెద్దవయ్యాయి. కొన్నాళ్లకి ఎగిరిపోయాయి.

కాకుల గోల వదిలిందని మా మామ శాంతపడ్డాడు.

కాకి గూడు కాపాడానని నేను సంబరపడ్డాను.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*అక్టోబర్ 2017*



12 నవంబర్ 1975న పుట్టిన కృష్ణజ్యోతి మొదటి కథ **సవారి** తెలుగు వెలుగు మాసపత్రికలో ప్రచురింపబడింది. ఇప్పటివరకు ముప్ఫై కథలు ప్రచురితమయ్యాయి. వృత్తి విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో అధ్యాపకురాలు.

*చిరునామా:* ***1-10-75/1, అరటి తోట, పాతూరు, కావలి.***
***ఫోన్: 94405 04898***
***mskkrishnajyothi@gmail.com***